
# ఆచార్య దేవోభవ

**- ఎం.వెంకటేశ్వరరావు**

"నారాయణా! టీ పట్టుకురా!" పదో తరగతికి ఫస్ట్ పీరియడ్ ఇంగ్లీషు పొయెట్రీ చెప్పి తన గదికొచ్చి కూచున్నాడు హెడ్మాష్టరు సత్యమూర్తి టేబిల్ మీదున్న న్యూస్ పేపర్ చూస్తుంటే, "మే ఐ కమిన్ సార్" పిలుపునకు తలెత్తకుండానే "యస్" అన్నాడాయన.

మళ్ళీ "సార్"అని విన్పించేసరికి, లోపలికొస్తున్న అమ్మాయివైపు చూసి, "చెప్పమ్మా! నువ్వు నైన్త్ క్లాసు సుభాషిణివి కదు" అన్నాడు. "అవున్సార్" అని నిలబడి నేల చూపులు చూస్తున్న ఆ అమ్మాయితో "చెప్పమ్మా! ఏం కావాలి?" అనునయంగా అడిగాడాయన.

"సార్! అదీ... అదీ... కొత్తగా వచ్చిన సుధాకర్ మాస్టారు నావైపు అసభ్యంగా చూస్తున్నారు. ఏవో సైగలు చేస్తున్నారు. ఈరోజు ఫస్ట్ పీరియడ్లో నన్ను పాఠం చదవమన్నారు. చదువుతుంటే నా పక్కకొచ్చి ఎవరూ చూడకుండా నా నడుంమీద చేత్తో గట్టిగా నొక్కారు సార్" అంది ఏడుస్తూ.



ఆ అమ్మాయి చేతికిచ్చిన పేపర్లో ఉన్న అదే మేటరు చదివి ఆశ్చర్యంగా "సుధాకర్గారా!?!" అన్నాడు.

"అవున్సార్" అందామ్మాయి ముక్కులు ఎగబీలుస్తూ.

"అలా ఎందుకు చేస్తారమ్మా! ఏదో పొరబాటున చెయ్యి తగిలుంటుంది. అని సర్దిచెబుదామనుకునేంతలో, చివాల్న కొంచెం ముందుకొచ్చిన సుభాషిణి తెల్లని నడుమీద గట్టిగా నలపగా తేలిన ఎర్రని ఆనవాళ్ళని చూపించేసరికి అవాక్కయ్యాడు సత్యమూర్తి.

సుభాషిణి బ్యాంకు మేనేజరు కూతురు. ఆర్నెల్ల క్రితం ట్రాన్స్ఫరు మీద హైదరాబాదు నుండి వచ్చారు. అందంగా, వయసుకి మించిన భారీతనంతో తెల్లగా బొద్దుగా ఉంటుంది. చదువులోనూ చురుకైన సుభాషిణి ఎదుటి వాళ్ళ చూపుల్నీ, చేష్టల్నీ పసిగట్టలేని బాల్యం లేదు.

"నారాయణా! నువ్వెళ్ళి సుధాకర్సార్ని పిలుచుకురా!" అన్చెప్పి అలా కూచోమ్మా" అని స్టూలు చూపించాడు.

రెండు నిమిషాల తర్వాత తిరిగొచ్చిన నారాయణ "సార్! ఎయిత్ క్లాస్లో ఉన్నారు. క్లాసయ్యాక వస్తానన్నారు"అని చెప్పాడు.

"నువ్వు క్లాసుకెళ్ళమ్మా! నేను విచారించి, అవసరమైతే నిన్ను పిలిపిస్తాను"అని చెప్పేసరికి, సుభాషిణి క్లాసుకెళ్ళింది.

సుధాకర్ కొత్తగా వచ్చిన సైన్సు మాస్టరు. మొదటిసారి అతన్ని చూడగానే టీచరన్న భావన కల్గలేదు సత్యమూర్తికి. ఆయనకే కాదు ఎవరికీ కల్గదు. మోకాళ్ళమీద వెలిసి పోయిన జీన్సు ప్యాంటు, దానికి అతికించినట్టు కన్పిస్తున్న జేబులు, వాటికి పీలికల్లా వ్రేలాడే తాళ్ళు, పొట్టి చొక్కా, ఫ్రెంచి గడ్డం, చేతిలో సెల్ఫోను, మూడంగుళాల మందంగా ఉన్న ఎత్తయిన షూసులో అతన్ని చూడగానే ఇతనేం పాఠాలు చెప్తాడనుకున్నారంతా. కానీ అతను పాఠాలు చెప్పే విధానం, ఇంగ్లీషు మీద పట్టు ఉండటంతో, ఎవరూ అతని వేష ధారణ గురించి అంతగా పట్టించుకోలేదు. తరంలో మార్పు అని సరిపెట్టుకున్నారు. నేటికీ ధోవతీ, పొడుగు చేతుల చొక్కా, ఉత్తరీయం, నుదిటిన విభూతి రేఖలు, కొట్టొచ్చినట్టు కన్పించే బొట్టు పెట్టుకొచ్చే సత్యమూర్తిలాంటి ఆ తరం వాళ్ళు.

"సార్! టీ తెచ్చి చాలా సేపయింది"అని నారాయణ చెప్పేసరికి చల్లారిపోబోతున్న టీ గడగడా తాగేశాడు సత్యమూర్తి.

పేపరులో ఉన్న అక్షరాల వెంట కళ్ళు కదుల్తున్నా, మనసు మాత్రం సుభాషిణి చెప్పిన మాటల దగ్గరే ఆగిపోతోంది. ముప్ఫయి అయిదేళ్ళ అధ్యాపక వృత్తిలో ఎన్నో పాఠశాలల్లో, ఎంతోమంది సహాధ్యాయులతో పనిచేశాడు. ఎంతో మంది విద్యార్థుల అభివృద్ధికి పునాది వేసిన వాళ్ళలో తనూ ఒకడిగా మంచి పేరు తెచ్చుకున్నాడు. కానీ ఏనాడూ ఇలా విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించలేదు.

సత్యమూర్తి కళ్ళు సుధాకర్కోసం గుమ్మం వైపు చూశాయి. రెండో పీరియడ్ ముగియటంతో పిల్లల అరుపులు, కేకలు విన్పిస్తున్నాయి. పది నిమిషాల తర్వాత మూడో పీరియడ్ మొదలవ్వటంతో, పిల్లల అల్లరి సద్దుమణిగింది. మరో పది నిమిషాల తర్వాత సుధాకర్ లోపలికొచ్చాడు. అప్పుడే సిగరెట్ తాగొచ్చిన వాసన అతనితోబాటే లోపలికొచ్చింది.

"సార్! పిలిచారట" అన్నాడు ఎదురుగ్గా ఉన్న కుర్చీలో కూచుని. "అవును" అని టేబిల్ మీదున్న లెటర్ తీసి అతని చేతికిచ్చాడు. దాన్ని చదువుతున్న సుధాకర్ మొహం వివర్ణమయింది.

"ఆ అమ్మాయిని పిలిపించండి" అన్నాడు కోపంగా.

"నారాయణా! వెళ్ళి నైన్త్ క్లాసులో సుభాషిణిని పిలుచుకురా!" చెప్పాడు సత్యమూర్తి.

లోపలికొచ్చిన సుభాషిణిని చూస్తూనే "నువ్వేనా ఈ కంప్లయింటు రాసిచ్చింది?" తీవ్రంగా ఆమెని చూస్తూ అడిగాడు సుధాకర్.

తలూపింది.

"నువ్వు నావైపు చూడకుండా, నేను నీ వైపే చూస్తున్నానని ఎలా అంటున్నావు చెప్పు" గద్దించినట్టన్నాడు.

సుధాకర్ (అతి) తెలివిగా మాట్లాడుతున్నాడని గ్రహించాడు సత్యమూర్తి.

"నేనెప్పుడు తల పైకెత్తినా... మీ చూపులన్నీ..."

"అంటే... నువ్వు నన్నే చూస్తున్నావు. అంతేనా?"

"నో సార్! మీ చూపులో తేడా ఉంది. మిగతా టీచర్లకీ, మీకూ..." అని భయం భయంగా అంటుంటే...

"వాడ్డూయూ మీన్?"

"మీ చూపులెప్పుడూ ... ఎప్పుడూ..."

"ఆఁ ఎప్పుడూ... చెప్పు... కమాన్" రెట్టించాడు సుధాకర్.

"మాస్టారూ అలా భయపెడితే ఎలా చెబుతుంది? సత్యమూర్తి అనేసరికి."

"ప్లీజ్! రెండు నిమిషాలుండండి" మాట్లాడొద్దన్నట్టు చెయ్యి చూపించాడు సత్యమూర్తికి.

కళ్ళురిమి సుభాషిణి వైపు చూస్తూ "చెప్పు నా చూపులు ఎక్కడైనా గుచ్చుకుంటున్నాయా?" అనేసరికి, తలొంచుకుని వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"చూశారా! ఇదీ వరస. లెసన్ చెబుతూ, ఈ అమ్మాయి వైపు తల తిప్పితే చాలు. వెకిలి చూపులు చూస్తుంటుంది" అని మళ్ళీ సుభాషిణి వైపు తిరిగి.

"ఏంటీ! నడుం దగ్గర నొక్కానా? ఏది ఎక్కడ? చూపించు" అంటూ కుర్చీనుండి లేచి, ముందుకొస్తుంటే.

సత్యమూర్తి అతని ప్రవర్తనకి ఆశ్చర్యపోయి, "ఆగండి మాస్టారూ! విచారించే పద్ధతి ఇది కాదు ఆగండి" అంటున్నా విన్పించుకోకుండా.

"కమాన్! చూపించు"అంటూ ఆమె నడుమువైపు చూస్తూ "ఇక్కడేనా?" అని వేలితో చూపబోతుంటే, బెదిరిపోయిన లేడిలా ఒక్క పరుగున సత్యమూర్తి పక్కకొచ్చి నిలబడ్డది సుభాషిణి.

"సుధాకర్గారూ! మీరు నాముందే ఇంత అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఇహ క్లాసులో మీ చూపులు, చేష్టలు ఎంత వికృతంగా ఉంటాయో తెల్సుకోలేనంత పసిపిల్ల కాదు సుభాషిణి. సమస్య పెద్దదవక ముందే మిమ్మల్ని మీరు సరిదిద్దుకోవటం మంచిది." అంతవరకూ నిగ్రహించుకున్న ఆగ్రహాన్ని వ్యక్తపరిచాడు సత్యమూర్తి.

"చూడండి! సత్యమూర్తిగారూ! నా ప్రవర్తన, చూపులు సరిలేవంటూ ఈ అమ్మాయి చెప్పటం, మీరు నన్ను స్టూడెంట్ ముందు నిలదీయటం, అవమానించడం మీకు తెల్సిన సభ్యత కావొచ్చు. ఓ.కే. ఈ అమ్మాయి లెసన్ సరిగా చదవటం లేదని ఒకటి రెండుసార్లు చెప్పాను. మళ్ళీ తప్పుగా చదువుతుంటే ఒక దెబ్బకొట్టాను. తప్పంటారా?"

"ఆడపిల్లల్ని ఎక్కడబడితే అక్కడ కొడ్తారా?" సత్యమూర్తి తీవ్రంగా అన్నాడు.

"రేపట్నుంచీ నేను కళ్ళు మూసుకుని పాఠం చెబుతాను. పిల్లల్ని కొట్టాల్సి వచ్చినపుడు, మిమ్మల్ని పిలుస్తాను. మీరొచ్చి ఆ పని చేద్దురుగాని"అని విసురుగా అనేసి.

"ఇంతేనా విచారణ! ఇంకేమైనా ఉందా? చాలదంటే పై వాళ్ళకి కంప్లయింటు చెయ్యండి"అని లేచెళ్ళాడు సుధాకర్.

అతని ప్రవర్తనకి, నిర్లక్ష్యపు వైఖరికి నిశ్చేష్టుడయిన సత్యమూర్తి, "నువ్వు క్లాసుకెళ్ళమ్మా! నేను ఇ.ఓ.గారికి కంప్లయింట్ చేస్తాను" అని సుభాషిణిని క్లాసుకి పంపాడు.

ఉన్మాదిలా మాట్లాడెళ్ళిన ఇలాంటి ఉపాధ్యాయుణ్ణి చూడటం సర్వీసులో ఇదే ప్రథమం. ఇదే చివరిసారీ కావాలనుకుంటూ కుర్చీలో కూచున్నాడు.

❋ ❋ ❋

పై సంఘటన జరిగిన పదిహేనోరోజు... సత్యమూర్తికి పదవీ విరమణ రోజు. ఊరి పెద్దలు, సహాధ్యాయులు, పాత, కొత్త విద్యార్థులు సత్యమూర్తిని ఘనంగా సన్మానించారు. వక్తలంతా ఆయన గుణగణాల్ని విశ్లేషించి, ఆయన అందించిన సేవల గురించి కొనియాడి, ఆయన అందుకున్న పురస్కారం గురించి పొగడ్తల జల్లు కురిపించారు. చివరిగా సత్యమూర్తి మాట్లాడుతూ...

"సభాయైనమః వేదిక మీది పెద్దలకు, ఆహూతులైన విజ్ఞులకు నమస్కారం. బాల్యంనుండి నాకు అధ్యాపక వృత్తిమీద ఎనలేని గౌరవం. పిన్న వయసులో మనసులో నాటుకున్న బీజాక్షరాలు" మాతృదేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ." తల్లిదండ్రుల తర్వాత అంతటి పవిత్ర స్థానాన్ని పొందిన ఉపాధ్యాయుణ్ణవ్వాలనుకునేవాణ్ణి. అయ్యాను. క్రమం తప్పని క్రమశిక్షణ, వలువలున్న విలువలు, గౌరవ మర్యాదలు, విద్యార్థుల యందు ప్రేమాభిమానాలు... ఇలా ఎన్నో ఆచరణయోగ్యమైన సద్గుణ సంపదల్ని నాకందించారు నా గురువులు. వాటిని తు.చ. తప్పకుండా పాటిస్తూ, ఎన్నో మైలురాళ్ళు దాటి, చివరికి "పదవీ విరమణ" అనే చరమాంకంలోకి ప్రవేశించానీవేళ. ఈ సందర్భంగా నా అనుభవాల పుస్తకంనుండి కొన్ని పుటల్ని మీ ముందుంచాలనుకుంటున్నాను.

సమాజ పురోభివృద్ధికి ఉపాధ్యాయులు పునాదిరాళ్ళ వంటివాళ్ళు. దేశ భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఆధారపడి ఉంటుంది. విద్యార్థుల్ని ఉత్తమ పౌరులుగా, ఉన్నత లక్ష్యాల్ని అధిరోహించడానికి ప్రేరణనిచ్చేవాడే ఉత్తమ ఉపాధ్యాయుడు. అతనో మార్గదర్శి. బండరాళ్ళను భావి పౌరులుగా మలచగలిగే మహాశిల్పి. ఉపాధ్యాయుడు ప్రేమను బోధించే క్రీస్తులా, జీవిత గీతను వివరించే శ్రీకృష్ణుడిలా, కరుణను పంచే బుద్ధుడిలా, అహింసను ప్రబోధించే గాంధీలా, త్యాగాన్ని ప్రవచించే ప్రవక్తలా ఉండాలి.

ఇంతటి పవిత్ర ప్రమాణాలున్న ఉపాధ్యాయ వృత్తి నేడు వ్యాపారాత్మకంగా మారింది. విద్య అమ్మబడుతోంది, కొనబడుతోంది. విలువలకి నేడు వలువలు లేవు. గురువులు లఘువులుగా మారిపోతున్నారు. నైతిక విలువలు నడిరోడ్డెక్కాయి. ఉపాధ్యాయుల చూపుల్లో కరుణకి బదులు కామం, స్పర్శలో శృంగారం శృతిమించుతున్నాయి. ఒకప్పుడు స్త్రీలు ఉపాధ్యాయ వృత్తికి పెద్దపీట వేసి ఉద్యోగాలు చెయ్యటానికి ముందుకొచ్చారంటే... కారణం భద్రత, పవిత్రతలకిది పుట్టిల్లనుకున్నారు. కానీ ఇవ్వాళ తరాలు మారాయి, తారతమ్యాలు పోయాయి. తమ బిడ్డల వయసున్న విద్యార్థినులపై, తోబుట్టువుల్లాంటి సహాధ్యాయినిలపై అత్యాచారాలు చెయ్యడం ఇవ్వాళ మనం పత్రికల్లో, టీ.వి.ల్లో చూస్తున్నాం. ఎంతో మంది విదేశీయులు మన సంస్కృతి, సంప్రదాయాలకు అభివాదం చేస్తుంటే, సరస్వతీ పుత్రులుగా గౌరవ మర్యాదలందుకుంటున్న నేటితరం ఆచార్యులు సైతం క్షణిక కామోద్రేకాలకు తాము అతీతులం కాదన్నట్టు విదేశాల్లో మన సంస్కృతి, నాగరికతలు సిగ్గుతో చచ్చిపోయేలా ప్రవర్తిస్తున్నారు. ఎటు పోతున్నాం మనం? ఇది పురోగమనమా? తిరోగమనమా? ఆలోచించుకోవాల్సిన తరుణం ఆసన్నమయింది.

ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశానికి ఇస్తున్న అర్హతలతో బాటు, క్రమశిక్షణ, నైతిక విలువలు బోధించే పునశ్చరణ తరగతులు అధ్యాపక వృత్తిలో ఉన్న వాళ్ళకి తరచూ నిర్వహించాలి.

అదే ఆలోచిస్తున్నాను పూర్ణా! ఇన్నేళ్ళలో ఏ ఒక్కరోజైనా పిల్లలకి పాఠాలు చెప్పకపోతే వెలితిగా ఫీలయ్యేవాణ్ణి. ఇహమీదటా... ఆ వెలితి ఉండకూడదని, మన పక్క ఊళ్ళో ఉన్న అనాధ పిల్లల ఆశ్రమంలో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు చదువు చెప్పొద్దామనుకుంటున్నాను.



"గురువులకు గౌరవం ఇతరులు ఇచ్చేది కాదు. అది వాళ్ళు సంపాదించుకునేది" అని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పిన నిజాన్ని సజీవంగా ఉంచుకోవాలంటే ఈ తరం ఉపాధ్యాయులు ముందు తమని తాము ప్రక్షాళన చేసుకోవాలి. ఉపాధ్యాయుడు ఎప్పుడూ మార్గం చూపే దిక్సూచిలా ఉండాలే తప్ప, తప్పుచేసి తల దించుకునే దోషిలా మారకూడదు" అని తన సుదీర్ఘోపన్యాసంలో తన అభిప్రాయాల్ని అందరికీ అర్థమయ్యేలా వివరించిన సత్యమూర్తి చివరగా "ఉపాధ్యాయులంతా నైతిక విలువల్ని విస్మరిస్తున్నారని కాదు నా భావన, విస్మరిస్తున్న వాళ్ళ సంఖ్య విస్తరిస్తోందన్నదే నా ఆవేదన" అని ముగించాడు.

❋ ❋ ❋

ఆరోజు కార్యక్రమాలన్నీ ముగించుకుని, ఇల్లు చేరిన సత్యమూర్తి, విశ్రాంతిగా హాల్లో పడక్కుర్చీలో కూచుని షోకేసులో కన్పిస్తున్న జ్ఞాపికల వైపు తృప్తిగా చూసుకున్నాడు. ముప్ఫయి అయిదేళ్ళ వృత్తిలో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా పలుమార్లు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయునిగా అందుకున్న పురస్కారాలతోబాటు, ఆయన రచించిన "ఉపాధ్యాయుడు- ఉన్నత విలువలు" పుస్తకం ఆయనని జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా నిలబెట్టింది. రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న పురస్కారపు జ్ఞాపిక వైపు మురిపెంగా చూస్తున్న సత్యమూర్తిని చూసిన భార్య.

"రేపట్నుంచీ వీటినే చూస్తూ కూచుంటారల్లే ఉందే" అంది కాఫీ అందిస్తూ.

"అదే ఆలోచిస్తున్నాను పూర్ణా! ఇన్నేళ్ళలో ఏ ఒక్కరోజైనా పిల్లలకి పాఠాలు చెప్పకపోతే వెలితిగా ఫీలయ్యేవాణ్ణి. ఇహమీదటా... ఆ వెలితి ఉండకూడదని, మన పక్క ఊళ్ళో ఉన్న అనాధ పిల్లల ఆశ్రమంలో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు చదువు చెప్పొద్దామనుకుంటున్నాను. నువ్వేమంటావ్" అన్నాడు.

"మీ అభీష్టానికి నా అభ్యంతరం ఎందుకుంటుంది" అందామె నవ్వుతూ. రాత్రి భోజనం ముగించుకుని, టి.వి.లో వార్తలు చూస్తున్నాడు సత్యమూర్తి.

ప్రాదేశిక వార్తల్లోని ముఖ్యాంశాలు:

హైదరాబాదులో ఓ ప్రముఖ కార్పొరేట్ జూనియర్ కాలేజీలో బాలికల హాస్టల్లో విద్యార్థిపై అత్యాచారం చెయ్యబోయిన లెక్చరర్‌కి విద్యార్థినులంతా కలిసి దేహశుద్ధి చేశారు. పోలీసులకి అప్పగించే లోపల, అతను గోడ దూకి పరారయ్యాడు. సదరు లెక్చరర్ అంతకు ముందు పని చేసిన కాలేజీలో ఇదే ప్రవర్తనవల్ల రెండు నెలల జైలుశిక్ష అనుభవించడం గమనార్హం. పోలీసులు కేసు నమోదుచేసుకుని అతనికోసం అన్వేషిస్తున్నారు. ఆ సంఘటనకి సంబంధించిన క్లిప్పింగ్స్‌ని, ఆ లెక్చరర్‌ని చూసిన సత్యమూర్తి చేతిలో ఉన్న రిమోట్‌తో టి.వి. ఆఫ్ చేశాడు.

"ఏవండీ? ఎంతసేపలా కూచుంటారు. రాత్రి పది దాటింది" లోపల్నుంచి భార్య పిలిచింది.

"నువ్వు పడుకో"అన్నాడు ముక్తసరిగా.

వాలు కుర్చీలో వెనక్కి వాలి ఆలోచిస్తున్న సత్యమూర్తికి కళ్ళెదురుగా సుధాకర్ నిలబడి నాకు నీతులు చెప్పే అర్హత మీకుందా? అని ప్రశ్నిస్తున్నట్టూ, షోకేసులో ఉన్న జ్ఞాపికలన్నీ తనచుట్టూ తిరుగుతూ వెక్కిరిస్తున్నట్టన్పించింది. లేక లేక పుట్టిన కొడుకు, బాల్యంనుండి తల్లి గారాబంవలన, తన భావాలకు విరుద్ధంగానే పెరిగాడు. స్నేహితులతో తిరుగుతూ, చెడు అలవాట్లకు బానిసై, చివరికి తండ్రిగా కొడుకుని అదేమని ప్రశ్నించలేని స్థితి ఏర్పడ్డది. ఎమ్మెస్సీ వరకూ చదువుకున్నా, సంస్కారంలో సున్నా స్థానంలోనే ఉన్నాడు. పరువు మర్యాదలు బజార్న పడుతుంటే, కఠినంగా మందలించడంతో సంవత్సరం క్రితం ఇల్లొదిలి హైదరాబాదులో ఉద్యోగం చూసుకుంటానని వెళ్ళాడు. అడ్రస్ గానీ, ఫోన్ నంబరు గానీ ఇంటికి తెలియపర్చలేదు. పెళ్ళీడు దాటిపోయింది. భార్య పోరు భరించలేక అడపాదడపా సంబంధాలు చూసినా, ఒక్కటీ కొలిక్కి రాలేదు. సత్యమూర్తి అర్ధరాత్రి వరకూ ఆలోచిస్తూనే ఉన్నాడు. చిన్న వేరుపురుగు మహావృక్షాన్నే మట్టుబెట్టినట్టు ఎన్నో ఏళ్ళుగా తను సంపాదించుకున్న గౌరవ మర్యాదలన్నీ ఇవ్వాళ్టితో సమూలంగా సమాధయ్యాయి. రేపు టి.వి.ల ముందు, పత్రికల ముందు కన్న తండ్రిగా కొడుకుచేసిన పనికి సంజాయిషీ ఇచ్చుకునే స్థితిలో... అంతే! ఆపై సత్యమూర్తి మనసు ఆలోచించడం మానేసింది.

కళ్ళుమూసుకుని వెనక్కి వాలిన ఆయన కళ్ళ వెనక జవాబు దొరకని ఎన్నో ప్రశ్నలు. పండిత పుత్రః పరమ శుంఠః అన్న నానుడి నిజం కారాదని కొడుకుకోసం తను చేసిన ప్రయత్నాలన్నీ నిష్ప్రయోజనాలయ్యాయి. ఒక్కగానొక్క కొడుకు అభివృద్ధికోసం కన్నకలలపై ఒక్కసారిగా చీకట్లన్నీ ధ్వజమెత్తి ధ్వంసం చేసినట్టుగానూ, లెక్క తెగని బంధాలపై ఉక్కపోత వర్షంలా కురుస్తున్నట్టుగానూ అన్పించింది. కుదించబడ్డ ఉచ్ఛ్వాస నిశ్వాసాలు మనస్సాక్షికి ఇచ్చుకుంటున్న సంజాయిషీలా, సముద్రమంత సంతోషాన్ని ఇముడ్చుకోగల సత్యమూర్తి గుండె, ఇప్పుడీ దుస్సంఘటనని దిగమింగుకునే శక్తి తనకులేదని, ఎవ్వరికీ, ఎటువంటి సంజాయిషీలకూ స్థానం లేని చోటుకు, ఇన్నేళ్ళూ ఉన్నత వ్యక్తిత్వంతో ఓ అజేయ శిఖరంలా నిలబడ్డ సత్యమూర్తికి "శాశ్వత విశ్రాంతి" ప్రకటిస్తూ బలహీన పడుతున్న ఆఖరి ఘడియల్లో ఆయన మదిలో చివరిసారి మెదిలిన తారక మంత్రం "ఆచార్య దేవోభవ."★